క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోకుల్‌నగర్, రాంనగర్, అశోక కాలనీ, పోచమ్మగుడి, విద్యానగర్, గాంధీనగర్, అంబేడ్కర్ భవన్, వాజ్‌పేయి నగర్, బీరన్నకుంట ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు, వేయి స్తంభాల దేవాలయం, యునాని హాస్పిటల్, శ్రీనివాస కిడ్నీ హాస్పిటల్, న్యూ రాయపుర, రాయపుర ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

నేడు జర్నలిస్టుల 3కే రన్

నయీంనగర్: ప్రెస్ క్లబ్ సభ్యులకు నిర్వహిస్తున్న క్రీడల నేపథ్యంలో గురువారం ఉదయం 6గంటలకు ప్రెస్ క్లబ్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు జర్నలిస్టుల 3కే రన్ ఉంటుందని ప్రెస్‌క్లబ్ కమిటీ బుధవారం తెలిపింది. అనంతరం ఆర్ట్స్ కళాశాలలో క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని పేర్కొంది.

19న రైల్వే సేఫ్టీ సెమినార్

కాజీపేట రూరల్: ఈనెల 19వ తేదీన ట్రాక్ మెయింటనర్ల సేఫ్టీ సెమినార్‌ను కాజీపేట జంక్షన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ తెలిపారు. కాజీపేట, రామగుండం, బెల్లంపల్లి, డోర్నకల్, మధిర రైల్వే స్టేషన్ల పరిధిలో పనిచేస్తున్న వారు సదస్సులో పాల్గొనాలని పేర్కొన్నారు.

కుల గణనపై ప్రభుత్వ నిర్లక్ష్యం

హన్మకొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్ విమర్శించారు. ఎన్నికల హామీల్లో భాగంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో పొందుపరిచిన కుల జనగణన, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధనకు ఈనెల 13న మధ్యాహ్నం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బీసీల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేసి బీసీ కులగణన బిల్లు ఆమోదించాలని, కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, కులగణన విధివిధానాలకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని, కులగణనలో బిహార్ రాష్ట్రాన్ని మోడల్‌గా తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు ప్రణాళికలను ప్రకటించాలని పేర్కొన్నారు.

కిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్



హసన్‌పర్తి: కిట్స్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న నలిగంటి సంతోష్‌కుమార్.. గీతం యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డాక్టర్ యలవర్తి రాధిక పర్యవేక్షణలో 'బ్లడ్ వేసెల్ సిగ్మెంటేషన్ ఫ్రమ్ డయాబెటిక్ రెటినోపతి ఫండస్ ఇమేజెస్ యూజింగ్ సింగులర్ వాల్యూ డీకంపోజిషన్ అండ్ మాక్సిమమ్ ప్రిన్సిపల్ కర్వేచర్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంతోష్‌కుమార్ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ రెడ్డి, రిజిస్ట్రార్ కోమల్ రెడ్డి, డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి అభినందించారు.

కార్మికుల సేవలు గొప్పవి



కాశిబుగ్గ: పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి అందిస్తున్న సేవలు గొప్పవని 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కొనియాడారు. శివనగర్ వాటర్ ట్యాంక్ వద్ద రెండు నెలలుగా డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు తన సొంత ఖర్చుతో పెడుతున్న మధ్యాహ్న భోజన వసతి కార్యక్రమానికి కార్పొరేటర్ బుధవారం ముగింపు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి మండుటెండల్లో డివిజన్ శుభ్రతకు కార్మికులు ఎంతో పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్‌రెడ్డి, జవాన్ కొమురెల్లి, ప్రేమ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఐక్య ఉద్యమాలు

కాజీపేట: ఎస్సీ వర్గీకరణ సాధనకు మరోమారు ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన సమయం ఆసన్నమైందని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న మాదిగల జనసభలను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షుడిగా ఇసురం శ్రీనివాస్‌ను నియమించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎడ్ల మహిపాల్, ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల అనిల్‌కుమార్, రవి, దార రవి, బర్ల శంకర్, ఎడ్ల అశోక్, రాజు, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యూశాయంపేట: విద్యార్థికి యూనిఫాం అందిస్తున్న డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్



వరంగల్: చార్‌బౌళి పాఠశాలలో పుస్తకాలు..



ప్రతాప్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



కాజీపేట: పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తూ..



మడికొండ: పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఖిలా వరంగల్: టీఎస్ఎస్పీ క్యాంపు పాఠశాలలో..

న్యూశాయంపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ఈక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని వరంగల్ నగర డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ సూచించారు. 36వ డివిజన్ చింతల్‌లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలను బుధవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు వి.ఇందిర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో షమీమ్ మాట్లాడారు. అంతకుముందు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమీన, శేషాచారి, అశోక్, సలీంపాషా, తబసుం, నుస్రత్ సబిహ, సాజిదా నుస్రత్, సునీత, రాధిక, అనిత, కోమల, నాజ్నిన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చార్‌బౌళి పాఠశాలలో పుస్తకాల పంపిణీ

వరంగల్: నగరంలోని 21వ డివిజన్ పరిధి ఎల్‌బీనగర్‌లోని చార్‌బౌళి, మొయిన్‌పురలోని ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్‌ను స్థానిక కార్పొరేటర్ ఎండీ.ఫుర్కాన్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు గోరంట్ల లక్ష్మి, హెచ్ఎం నర్సింగరావు, ఉపాధ్యాయులు గంగాధర్ తిలక్, అశోక్, రమేష్, శ్రీనివాస్, అలీ, హరికృష్ణ, కవిత, నీరజ, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

18, 35వ డివిజన్లలో..

కాశిబుగ్గ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజన సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని 18, 35వ డివిజన్ల కార్పొరేటర్లు వస్కుల బాబు, సోమిశెట్టి ప్రవీణ్ తెలిపారు. ఈమేరకు ఆయా డివిజన్లలోని పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను బుధవారం అందజేసి వారు మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీధర్, ప్రకాష్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, నాయకులు జన్ను వివేక్, కిన్నెర రవి, జక్కం ప్రవీణ్, రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు ప్రభుత్వ బడుల్లో ఉండాలి

కాజీపేట: బడీడు పిల్లలందరూ ప్రభుత్వ బడుల్లో ఉండేవిధంగా అందరు కలిసికట్టుగా కృషి చేయాలని కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ సూచించారు. కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీ, జూబ్లీ మార్కెట్‌లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మడికొండ ఎంపీపీఎస్‌లో..

మడికొండ: ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కావడంతో మొదటి రోజు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను మడికొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం మల్లారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రాజేశ్వరి, రమేష్, అరుణ, మన్నె చంద్రయ్య, హైమవతి, కమల, సరిత, పాఠశాల సిబ్బంది, స్థానికుడు పెండ్లి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఖిలా వరంగల్‌లో..

ఖిలా వరంగల్: మండల పరిధిలోని పలు ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్, స్కూల్ యూనిఫాంలను బుధవారం పంపిణీ చేశారు. టీఎస్ఎస్పీ క్యాంపు పాఠశాల హెచ్ఎం శ్రీనిధిశర్మ ఆధ్వర్యాన, రైల్వే గేట్ పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ విజయ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలతో విద్యావ్యవస్థ ధ్వంసం



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: ఉపాధ్యాయులు బెత్తం పడితేనే మెరుగైన ఫలితాలు వస్తాయని, ఈక్రమంలో నాటి విద్యా వ్యవస్థ తీరును వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు గుర్తుచేశారు. గతంలో గురువులు, తల్లిదండ్రుల పట్ల విద్యార్థులు భయం, భక్తితో ఉండేవారని చెప్పారు. ప్రైవేట్ విద్యాసంస్థలతో విద్యావ్యవస్థ ధ్వంసమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సిద్ధాపురం, వంగపహాడ్ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, యూనిఫాంలను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ విద్యాలత, వసుంధర ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, పెసరు శ్రీనివాస్‌రెడ్డి, మేర్గు రాజేష్, జీవన్‌రెడ్డి, వీసం సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, ప్రధానోపాధ్యాయులు రవికుమార్, సుజాత, శ్రీనివాస్, శ్రీధర్‌స్వామి, దోమకుమార్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, మార్త రవీందర్, జనగాని కిరణ్, మాజీ సర్పంచ్ మదన్‌గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వినీల

మడికొండ: సఖి కేంద్రం సేవలను బాధిత మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కేసు వర్కర్ వినీల సూచించారు. కాజీపేట మండలం రాంపూర్‌లో సఖి వన్ స్టాప్ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. విడిపోవాలనుకున్న భార్యభర్తలను కౌన్సెలింగ్ ద్వారా ఒకటిగా కలపడం, వరకట్న, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేయించుకోవాలనే వేధింపులకు గురయ్యే బాధితుల రక్షణకు సఖి సెంటర్ ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. సహాయం కోసం వచ్చిన బాధిత మహిళలు, బాలికలకు ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ, పోలీసు, వైద్య సహాయాలు, తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు చెప్పారు. బాధితులు 0870 – 2452112, లేదా 181 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కేసు వర్కర్ వినీల, పారామెడికల్ సిబ్బంది సరిత, ఆర్పీ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల విరాళం



మాట్లాడుతున్న చందా విజయ్‌కుమార్

రామన్నపేట: నగరంలోని ఏవీవీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో 1982వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు.. పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయంగా రూ.1.50 లక్షలను విరాళంగా అందజేసినట్లు ఏవీవీ విద్యాసంస్థల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిజిటల్ గది ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు విరాళం అందజేసినట్లు వివరించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి విరాళం అందజేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో శాశ్వత సభ్యుడు చందా శ్రీకాంత్, సంఘ సభ్యులు చకిలం మదన్‌మోహన్ రావు, మురళీమోహన్, పూర్వ విద్యార్థులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, అకడమిక్ కో ఆర్డినేటర్ వాసుదేవులు, చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి వేద ప్రకాశ్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వద్దు.. క్లాత్ బ్యాగులే ముద్దు



బట్ట సంచులను పంపిణీ చేస్తున్న నాయకులు

వరంగల్ / వరంగల్ చౌరస్తా: మానవులు, పశుపక్ష్యాదులకు హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని, బట్ట, గన్నీ సంచులను మాత్రమే ఉపయోగించాలని పర్యావరణ నేషనల్ ఎన్‌జీఓ నెట్ వర్క్ ప్రతినిధులు సూచించారు. ఈమేరకు వరంగల్ కూరగాయల మార్కెట్‌లో బుధవారం విస్తృత ప్రచారం చేశారు. 13 స్వచ్ఛంద సంస్థల అందించిన సుమారు వేయి బట్ట బ్యాగులను కూరగాయలు, పండ్ల మార్కెట్‌లోని వినియోగదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్, మార్కెటింగ్ అధికారి ప్రసాద్ రావు, మార్కెట్ కార్యదర్శి రాము, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, వర్తక సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, జేజేబీ సభ్యుడు సుభాష్, చైల్డ్ వెల్ఫేర్ చైర్మన్ మండల పరశురాములు, వివిధ సంఘాల ప్రతినిధులు నిమ్మల శ్రీనివాస్, కుసుమ కవిత, పద్మ, రమేష్, కుమారస్వామి, సుధాకర్, కుమారి రాణి పాల్గొన్నారు.

ఎస్‌జీటీలు హాజరు కావాలి

కాశోజీ సెంటర్: స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పదోన్నతులకు స్పెషల్ ఎడ్యుకేషన్ బీఎడ్ (ఆర్‌సీఐ గుర్తింపు సంఖ్య పొందిన) అర్హత గల ఎస్‌జీటీలు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీస్ రిజిస్టర్ తీసుకొని డీఈఓ కార్యాలయానికి గురువారం ఉదయం హాజరు కావాలని వరంగల్ డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో కోరారు. ఒక ఎస్‌జీటీ ఒకటి కంటే ఎక్కువ సబ్జెక్టులకు పదోన్నతికి అర్హత కలిగి ఉంటే, ఆ ఉపాధ్యాయుడు ఒక సబ్జెక్టుకు తన ప్రాధాన్యతను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

8వ వేతన కమిషన్ అమలు చేయాలి

కాజీపేట రూరల్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వ వేతన కమిషన్‌ను అమలు చేయాలని ఆల్ ఇండియా రైల్వే మెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) జనరల్ సెక్రటరీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కన్వీనర్ శివగోపాల్ మిశ్రా డిమాండ్ చేసినట్లు రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్ తెలిపారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ గౌబాకు ఆయన లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ప్రతీ పదేళ్లకోసారి పే కమిషన్ ఏర్పాటు చేయాల్సి ఉందని గుర్తుచేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రవీందర్ కోరారు.

సామూహిక ప్రార్థనలకు తరలిరావాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈద్గా ప్రతినిధులు

ఖిలా వరంగల్: ఈనెల 17న జరుపుకునే బక్రీద్ పర్వదినాన ఉదయం 9గంటలకు సామూహిక ప్రార్థనలు ఉంటాయని ఈద్గా ప్రతినిధి ఏంఏకే తన్వీర్, ఎం డీ.నూరొద్దీన్ తెలిపారు. ఈక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లోని ఈద్గా మజీదు ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను వారు బుధవారం పరిశీలించి మాట్లాడారు. మత గురువు మౌలానా అఫీజ్ మహ్మద్ నోమాన్ రజా ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఈద్గా మైదానంలో అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో షఫియొద్దీన్, నాసీర్ బేగ్, ముఖిద్ ఖాన్, మున్నా, వాలి, ముఖీద్‌ఖాన్, యాకూబ్, జమీల్, వలి, మన్సూర్ అలీ, సర్వర్ పాల్గొన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై విచారణ జరపాలి



అంబేడ్కర్ కూడలిలో రాస్తారోకో చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

హన్మకొండ: దేశవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదవడానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో విద్యార్థులతో కలిసి బుధవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మే 5న పరీక్షను నిర్వహించగా దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని అన్నారు. ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడమనేది వారి అనుమానాలకు బలమైన కారణమని చెప్పారు. వారందరి పరీక్ష కేంద్రం ఒక్కటే కావడంతో బాధితుల వాదనకు బలం చేకూరుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్, నాయకులు కుంటి పవన్, శ్రీపతి వినయ్, దేవరాజుల శివ, రిషిత, రేష్మ, దీప్తి, వైష్ణవి, ప్రియాంక, అనూష, ఐశ్వర్య, రాము, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహార పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత సూచించారు. కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలో బుధవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, డాక్టర్ క్రాంతిదీప్తి, అంగన్‌వాడీ టీచర్లు పాక శ్రీలత, బాలశ్రీ, పుష్ప, అన్నపూర్ణ, ఆయాలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి

ఖిలా వరంగల్: తూర్పు వర్కింగ్ జర్నలిస్టులకు కోసం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని జర్నలిస్టులు కోరారు. ఈమేరకు మధ్యకోట ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమానికి హాజరైన మంత్రి కొండా సురేఖను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బండి రవి, కమటం వేణుగోపాల్, అజయ్, అమీర్, చిన్నబాబు, వంశీ, అనిల్, ప్రభాకర్, గంగరాజు, నితీష్, నాగరాజు, శ్యామ్, అక్రమ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మామునూరు: కారు, బైక్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన సోను అనే యువకుడు వ్యక్తిగత పనుల మీద మంగళవారం వరంగల్ చేరుకుని సాయంత్రం బైక్‌పై తిరిగి తిర్మలాయ పల్లికి బయల్దేరాడు. ఈక్రమంలో ఫోర్ట్‌రోడ్డు నాగమయ్య గుడి కమాన్ వద్ద ఎదురుగా వచ్చిన కారు అదుపు తప్పి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో సోను తలకు బలమైన గాయాలుకాగా స్థానికులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కేసు నమోదు చేసిన మిల్స్‌కాలనీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక

విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ రోడ్డులోని హనుమాన్‌నగర్ పరపతి సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించి సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందికొండ సదానందం, ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరు దేవేంద్రచారి, కోశాధికారిగా ఓదెల సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా చెకోజి రాజేందర్, గౌరవ సలహాదారుడిగా ఆచార్య రాజేశ్వర్‌రావు, ప్రచార కార్యదర్శిగా ఉప్పుల రాజు ఎన్నికయ్యారు.

టీడీపీ సంబురాలు

హసన్‌పర్తి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో బుధవారం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డాక్టర్ సత్యనారాయణ, నాయకులు దాసరి సుధాకర్, బొనగాని రమేష్, మొగిలి, సంపత్, శ్రీనివాస్, కోటేశ్వర్, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి తరలిన టీడీపీ నాయకులు

కాజీపేట రూరల్: చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకారానికి నగరం నుంచి పలువురు టీడీపీ నాయకులు ఏపీకి తరలివెళ్లినట్లు నాయకుడు యాకోబు తెలిపారు. కాజీపేట దర్గా ప్రాంతానికి చెందిన బైరపాక ప్రభాకర్, అనిశెట్టి సతీష్, బైరి శేషాద్రి, ఎలగందుల రవీందర్‌గుప్తా, వెళ్లినట్లు వివరించారు.

కారు డ్రైవర్‌పై అధికారి ఫిర్యాదు?

వరంగల్: మిషన్ భగీరథ శాఖ కార్యాలయంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉద్యోగిపై అదేశాఖలో ఎస్ఈగా పనిచేస్తున్న ఒక ఉన్నతాధికారి హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. హసన్‌పర్తిలోని మిషన్ భగీరథ కార్యాలయంలో ఎస్ఈ కార్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి.. కారు తాళం చెవులు అప్పగించకుండా, విధులకు రాకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నందున ఆగ్రహానికి గురైన సదరు ఉన్నతాధికారి.. ఫిర్యాదు చేసినట్లు సమాచారం. డ్యూటీ ముగిసిన వెంటనే వాహనం తాళాలను కార్యాలయంలోనే పెట్టాల్సి ఉంటుంది. అలా కాకుండా తన వద్దనే ఉంచుకోవడం, ఇతరులకు బాధ్యతలు అప్పగించాలని ఆదేశించినా పట్టించుకోక పోవడంతో ఎస్ఈ అసహనానికి గురైనట్లు తెలిసింది. డిపార్టుమెంట్ వాహనం అందుబాటులో లేకపోవడంతో రెండు రోజులుగా ఎస్ఈ తన సొంత వాహనంలోనే పనుల పర్యవేక్షణకు వెళ్లినట్లు సమాచారం.

రాధక్క ఆశయాలను కొనసాగిద్దాం



రాధక్కకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: సీపీఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకురాలు, గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్ర పుల్లారెడ్డి సతీమణి రాధక్క అనారోగ్య సమస్యలతో మృతి చెందడం బాధాకరమని, ఆమె ఆశయాలను కొనసాగిద్దామని బార్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, న్యూడెమోక్రసీ నేత గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వర్ రావు అన్నారు. ఖిలా వరంగల్ పడమర కోట అమరవీరుల స్తూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో రాధక్క సంతాప కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధక్క చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాధక్క పాలిటెక్నిక్ విద్య అభ్యసించే క్రమంలోనే విప్లవ భావాలకు ఆకర్షితులయ్యారని, స్టూడెంట్ ఫెడరేషన్ విద్యార్థి సంఘంలో పనిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ రమేష్, వేణుగోపాల్, ఆకుల కుమారస్వామి, బైరబోయిన ఐలయ్య, గంథ్రాతి హరిబాబు, ఇనుముల కృష్ణ, అక్బర్, వీరన్న తెలిపారు.

జైలుకెళ్లిన ఉద్యమకారులకు పింఛన్



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య, స్వామి

నయీంనగర్: 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు తెలంగాణ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేయబోతోందని, ఈక్రమంలో జాబితాలో పేర్లు లేనివారు ఆధారాలు సమర్పించాలని తెలంగాణ మూవ్‌మెంట్ డిటెన్యూస్ ఫోరం (1969) బాధ్యులు తిప్ప సారయ్య, ననుమాస స్వామి, అమృతరెడ్డి కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన పోరాటయోధులు ఎఫ్ఐఆర్ కాపీలను ఫోరంకు సమర్పించాలని సూచించారు. హనుమకొండ కోర్టు నుంచి పొందితన ఎఫ్ఐఆర్ కాపీల్లో తమ పేర్లు ఉన్నాయో లేవో ఉద్యమకారులు సరిచూసుకోవాలన్నారు. జైలుకు వెళ్లిన ప్రతీఒక్కరు పింఛన్ పొందే అవకాశం ఉందని, ఉద్యమకారులు తమ హక్కును కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తిరుపతి రెడ్డి, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



హసన్‌పర్తి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని అన్ని వర్గాలు కృషి చేయాలని కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని పూరిగుట్ట ప్రాంతంలో ఉన్న సాయిసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మన కట్టుబాట్లపై చట్టం చేద్దాం – బాల కార్మికుల వ్యవస్థను అంతం చేద్దాం' అనే నినాదంతో ముందుకు కదలాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మండల పరశురాములు మాట్లాడుతూ బాల కార్మికులు లేని సమాజాన్ని నిర్మించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీనివాస్‌రావు, భగవంతరావు, హెచ్ఎం శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.